క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగబాబు



చిలకలూరిపేట: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది మురికిపూడి నాగబాబు ఎన్నికయ్యారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడి కోసం గురువారం ఎన్నిక నిర్వహించారు. కేవలం అధ్యక్ష స్థానానికి మాత్రమే జరిగిన ఈ ఎన్నికల్లో మొత్తం 91 ఓట్లకు గాను 83 ఓట్లు పోలయ్యాయి. ఇందులో నాగబాబుకు 59 ఓట్లు రాగా, ఆయనపై పోటీ చేసిన ఎస్.భాగ్యారావుకు 23 ఓట్లు వచ్చాయి. దీంతో 36 ఓట్ల మెజార్టీతో నాగబాబు గెలుపొందారు. మిగిలిన కార్యవర్గానికి సంబంధించి ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, కార్యదర్శిగా ప్రత్తిపాటి వీరయ్య, సంయుక్త కార్యదర్శిగా బహుజంకు రాజేష్, కోశాధికారిగా అందె శివబాబులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికల పర్యవేక్షకులుగా సీనియర్ న్యాయవాదులు దాసరి చిట్టిబాబు, తోట శివ రామకృష్ణ, పుల్లగూర శామ్యూల్‌జాన్ వ్యవహరించారు.

25న వైఎస్సార్ ఆసరా పథకం

శావల్యాపురం: 2022–23 ఆర్థిక సంవత్సరంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత పథకంలో అర్హత కలిగిన స్వయం సహాయక మహిళా సభ్యులకు వర్తిసుందని వైఎస్సార్ క్రాంతి పథకం ఏరియా కోఆర్డినేటరు కె.హనుమానాయక్ గురువారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా బొల్లాపల్లి మండలం–770 గ్రూపులకు గాను రూ.5 కోట్ల 24 లక్షలు, ఈపూరు మండలం– 778 గ్రూపులు రూ. 6 కోట్లు 15లక్షలు, నూజెండ్ల మండలం–876 గ్రూపులు రూ. 5కోట్లు 33 లక్షలు, శావల్యాపురం మండలం–706 గ్రూపులు ఉండగా రూ. 5 కోట్లు 51 లక్షలు, వినుకొండ –669 స్వయ సహాయక మహిళా గ్రూపు సభ్యులకు రూ. 3కోట్లు 89 లక్షలు ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తుందన్నారు. ఈవేడుకలు స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో మండలాల వారిగా మహిళా సభ్యులు సారథ్యంలో వచ్చే నెల 05 వరకు జరుగుతాయన్నారు. ఈనెల 25న పథకం ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

ముస్లింలకు సహరీ ఏర్పాటు

వినుకొండ(నూజెండ్ల): రంజాన్ నెల సందర్భంగా వినుకొండ పట్టణంలోని షాదీఖానా నందు నెలరోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 3గంటలకు సెహరీ ఏర్పాటు చేస్తున్నట్లు రంజాన్ సెహరీ కమిటీ వినుకొండ అధ్యక్షుడు పీఎస్ ఖాన్ తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో గత 13 సంవత్సరాలుగా ప్రతి రంజాన్ నెలలో సెహరీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఒత్తిడికి గురికాకండి

చిలకలూరిపేట: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఇష్టంగా విద్యాభ్యాసం చేయాలని డైట్ కళాశాల అధ్యాపకులు కె.అజయ్‌కుమార్, తలత్ ఫాతిమాలు చెప్పారు. పసుమర్రులోని మద్ది కామయ్య జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి లోనైతే ఆందోళన పెరిగి చదివిన విషయాలు మరిచిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు బోధించేటప్పుడు జాగ్రత్తగా వినడం, విన్న విషయాలను పునరుచ్ఛరణ చేసుకోవాలని సూచించారు. అదే సమయంలో నిద్రాహారాలు మాని చదవడం వంటి పనులు చేయరాదని పేర్కొన్నారు. సమయాన్ని సరిగా వినియోగించుకున్నవారే జీవితంలో ఉన్నత స్థానానికి ఎదుగుతారని వెల్లడించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం ఎస్‌కెఎండీ యాసిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రమౌళిని వెంటనే విడుదల చేయాలి

నరసరావుపేట: తెలంగాణ పోలీసులు అరెస్టు చేసిన దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకుడు చంద్రమౌళిని వెంటనే విడుదల చేయాలని ఉద్యమ నరసరావుపేట నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మార్కెట్‌యార్డులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అరెస్టును ఖండించారు. నిరంతరం ప్రజల హక్కులు కోసం పాల్గొంటున్న చంద్రమౌళిని మావోయిస్టులతో సంబంధాలు అంటగట్టి అరెస్టు చేశారన్నారు. సమావేశంలో పీడీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, షేక్ దరియావలి, కంబాల ఏడుకొండలు పాల్గొన్నారు.

పోలేరమ్మతల్లి తిరునాళ్ల

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో శ్రీ పోలేరుతల్లి తిరునాళ్లను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా భక్తులు ఉదయాన్నే పొంగళ్లు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే గ్రామంలో జీర్ణోద్ధరణ జరపనున్న సోమేశ్వరస్వామి ఆలయ భూమి పూజా కార్యక్రమాల్లో కూడా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, దేవదాయ శాఖ అధికారి పుణ్యాల వెంకటరెడ్డి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ. 5 లక్షల ఆదాయం



మండలంలోని శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి తిరునాళ్ల వేడుకలు సందర్భంగా దేవాలయానికి ఆదాయం 5 లక్షల 11 వేల 384 రూపాయలు వచ్చినట్లు ఆలయ దేవదాయ శాఖ అధికారి కొల్లి హనుమంతరావు తెలిపారు. ఆయనతో పాటు ఆలయ చైర్మన్ సోమేపల్లి వీరాంజినేయులు,అధికారులు పి. వెంకటరెడ్డి, అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

–శావల్యాపురం

ఫిర్యాదుపై విచారణ



జగనన్నకు చెబుదాం స్పందనలో భాగంగా అందిన ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ గురువారం తెలిపారు. వెల్లటూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఎస్.దాసు స్పందనలో ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశానుసారం ఈ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో భూసమస్యను పరిశీలించామని, తగు చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు.

– బొల్లాపల్లి

పరీక్ష సామగ్రి అందజేత



పెదచెరువులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు పట్టణానికి చెందిన కుంచాల మురళీకృష్ణ ఆర్థిక సహకారంతో పరీక్షా సామగ్రిని అందజేశారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, కో–ఆర్డినేటర్ లక్ష్మీ, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

–నరసరావుపేట ఈస్ట్

భగత్‌సింగ్‌కు నివాళి



సీపీఐ ఎం.ఎల్. లిబరేషన్ పార్టీ ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి ఎం.సీతయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఐసీసీటీయూ పట్టణ కార్యదర్శి ఎస్‌కే ఫిరోజ్, అధ్యక్షుడు భాస్కర్, సహాయకార్యదర్శి ప్రసాద్, లోకల్ కమిటీ కోటేశ్వరరావు, బుజ్జి, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

– వినుకొండ(నూజెండ్ల)

పాడిపంటలతో తులతూగాలి

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి




ప్రభపై నుంచి ప్రసంగిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: శ్రీ శంకరస్వామి ఆశీసులతో ప్రజలందరూ పాడిపంటలు, సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన తిరునాళ్లలో బుధవారం రాత్రి ఆయన పాల్గొన్నారు. శంకరస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై నుంచి ప్రసంగించారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన నాలుగేళ్లలో నాగార్జున సాగర్ డ్యాం నీటితో నిండి సమృద్ధిగా వర్షాలు, పంటలు పండాయన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం కరువు, కాటకాలతో అతలాకుతలం అయిందన్నారు. తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలని అందుకు ప్రజలందరూ ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. రైతుల కోసం ఎన్నో పథకాలను జగన్‌మోహన్ రెడ్డి చేపట్టారన్నారు. రూ.32 లక్షల రూపాయలతో ప్రాథమిక వైద్యశాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విద్యాదీవెన, ఫీజ్‌రీయంబర్స్‌మెంట్, కాపునేస్తం, రైతుభరోసా లాంటి అనేక సంక్షేమ పథకాలను చేపట్టామన్నారు. వచ్చే నెల నుంచి ఫ్యామిలీ డాక్టర్ పథకం ప్రారంభమవుతుందన్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి బృందానికి గ్రామస్తులు ఎదురై స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, అన్నెం పున్నారెడ్డి, కురుగుంట శ్రీనివాసరెడ్డి, గుండాల వెంకటేష్, మానుకొండ వాసుదేవరెడ్డి, బత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న తోడులో చిరువ్యాపారులకు రుణాలు

- వైఎస్సార్ ఆసరా పథకం 3వ విడత ప్రారంభం
- 770 గ్రూపులకు గాను రూ.5.24 కోట్ల లబ్ధి



మాట్లాడుతున్న ఏపీఎం పి.వి.రంగారెడ్డి

బొల్లాపల్లి : స్థానిక వెలుగు పథకం కార్యాలయంలో గ్రామసమైక్యసంఘం సమీక్షా సమావేశం గురువారం ఏపీఎం పి.వి.రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ సమైక్యసంఘాల పరిధిలో స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలు, సామాజిక పెట్టుబడి నిధుల కింద ఇచ్చిన రుణాలను వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి రుణాలు పొందాలని తెలిపారు. జగనన్న తోడులో భాగంగా ప్రభుత్వం నుంచి చిరువ్యాపారులకు రూ.10వేలు ఆర్థికచేయూత అందుతుందని, ఈ పథకంలో తీసుకున్న చిరు వ్యాపారులు రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు. వైఎస్సార్ ఆసరా పథకం 3వ విడతలో లబ్ధి పొందిన వివరాలను గడపగడపకు ప్రచార నిర్వహణ ఉంటుందన్నారు. ఈ పథకంలో 770 మహిళా పొదుపు సంఘాలకు గాను రూ.5.24కోట్ల మేర లబ్ధిపొందారని తెలిపారు. ఈ నెల 25న ఈ పథకం 3వ విడత లాంఛనంగా ప్రారంభం కానుందన్నారు. సమీక్షా సమావేశంలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మంచి మార్కులు సాధిస్తే ప్రోత్సాహకాలు



విద్యార్థులకు సామాగ్రి అందిస్తున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: విద్యాభ్యాసంలో పదో తరగతి మైలురాయి వంటిదని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పరీక్షలకు హాజరుకానున్న 70 మంది విద్యార్థులకు తన స్వంత ఖర్చులతో పరీక్ష సామగ్రి అందించారు. పరీక్షల్లో సత్తా చాటి పల్నాడు జిల్లాలో పాఠశాలను మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేయాలన్నారు. మంచి మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తానన్నారు. పదో తరగతి పరీక్షలు విద్యాభ్యాసానికి తొలి మెట్టని, ఉన్నత విద్యాభ్యాసంలో రాణించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. గడిచిన కాలంలో పాఠశాలకు మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు మన గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్‌తో పాటూ వృత్తి విద్యా కోర్సుల్లో కూడా చదువుకునే అవకాశం ఉందన్నారు. విలువైన ఆస్తులను దొంగలు దొంగిలించినా, చదువును మాత్రం ఎవరూ దొంగిలించలేరని చెప్పారు.

పోటీతత్వం, క్రమశిక్షణతో మంచి మార్కులతో విజయం సాధించాలన్నారు. ఎవరూ ఆర్థిక కష్టాలతో చదువుకు దూరం కాకూడదనేది తన లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం సుందరరావు, గ్రామపెద్దలు యన్నం శివారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

గొరిజవోలు భూములకు కౌలు వేలం

నాదెండ్ల: గొరిజవోలు గ్రామ రెవిన్యూ పరిధిలోని షాహీ మసీదుకు చెందిన వక్ఫ్ భూములకు గురువారం జరగాల్సిన బహిరంగ కౌలు వేలం వాయిదా పడినట్లు పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లాబాషా చెప్పారు. 435 సర్వే నెంబరులో య.25.60 సెంట్లు 424లో య.6.31సెంట్లు, 430లో య.0.09 సెంట్లు మొత్తం య.32.00యకరాలకు గాను ఆరుగురు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి వేలానికి ఆసక్తి చూపారు. ఎకరాకు రూ.10 వేలు చొప్పున సాధారణ కౌలు ప్రారంభధరగా వక్ఫ్‌బోర్డ్ అధికారులు నిర్ణయించారు. దీంతో వేలంలో పాల్గొన్న ఆరుగురు తమడిపాజిట్లను వెనక్కు తీసుకోవటంతో వేలం పాట వాయిదా పడింది. దీనిపై వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ కరిముల్లా మాట్లాడుతూ పల్నాడు జిల్లా డీఆర్వో వి వినాయకంకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. తదుపరి ఉత్తర్వుల మేరకు మరోదఫా మూడేళ్ళ కాలానికి కౌలు వేలం నిర్వహిస్తామన్నారు.

రూ.25.15 లక్షలకు అశీలు హక్కు



కార్యాలయంలో వేలంపాటలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ సిబ్బంది

నరసరావుపేట: పురపాలక పరిధిలో 2023–24 ఏడాదికి అశీలు వసూలుచేసుకునే హక్కుకోసం మున్సిపల్ కమిషనరు డి.శ్రీనివాసరావు అధ్యక్షతన రెవెన్యూ అధికారులు గురువారం నిర్వహించిన బహిరంగ వేలంపాటల్లో పలువురు గుత్తేదారులు రూ.25.15 లక్షలకు హక్కులు దక్కించుకున్నారు. కూరగాయల మార్కెట్‌లో అశీలు వసూలుచేసుకునే హక్కును నిమ్మిశెట్టి మల్లీశ్వరి రూ.21.20లక్షలకు పాడి దక్కించుకోగా, చేపలు, మాంసం మార్కెట్‌లో హక్కులను గోళ్లమూడి ఏసురత్నం రూ.1లక్షకు, కబేళా–1ను రూ.95వేలకు దక్కించుకున్నారు. కబేళా–2ను డి.నాగేశ్వరరావు రూ.2లక్షలకు పాటపాడుకొని దక్కించుకున్నారు. సంద్రీ మార్కెట్‌కు గుత్తహక్కుకోసం ఎవరూ ముందుకురాకపోవటంతో వాయిదా వేశారు. రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, రెవెన్యూ ఇనస్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం



సాతులూరులో వైసీపీ అభిమానులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

నాదెండ్ల: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు సాతులూరు గ్రామంలోని రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారంతో వైభవంగా ముగిశాయి. రెండు రోజుల పాటూ జరిగిన వేడుకలకు గ్రామస్తులే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజు గురువారం వైసీపీ, టీడీపీ వర్గాలు పోటాపోటీగా విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గద్దె కోటేశ్వరరావు బృందం ఆధ్వర్యంలో రూ.5 లక్షల ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది. అర్ధరాత్రి వరకూ తీన్‌మార్ వాయిద్యాలతో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

హెచ్‌ఎంలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వెల్లటూరు రోడ్డులోని ఎంపీసీ ఫంక్షన్ హాల్‌లో అసిస్ట్, ఐటీసీ బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో వినుకొండ, నూజెండ్ల, బొల్లాపల్లి మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించిన హెచ్‌ఎంలకు స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు సంబంధించిన వర్క్‌షాప్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు, డాక్టర్ ఎల్. వెంకట్రావులు స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌పై అవగాహన కల్పించారు. ఈ అవార్డు కావాలంటే ఎలా ఎంపిక చేస్తారు, స్కూల్ ఎలా ఉండాలి అనే వివరాలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ టి.రామారావు, అసిస్ట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం. శ్రీనివాసరావు, సిబ్బంది హాజరయ్యారు.

తహసీల్దార్‌పై వాచ్‌మెన్ ఫిర్యాదు



సత్తెనపల్లి: తహసీల్దార్ కటకం నగేష్‌పై కార్యాలయ వాచ్‌మెన్ షేక్ సాయిబా సాహెబ్ గురువారం సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారికి ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్ గా చేస్తున్న తనతో తహసీల్దార్ నగేష్ మూడు నెలల నుంచి అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని, కొద్దిరోజుల నుంచి ఇది మరీ ఇబ్బంది కరంగా మారిందని పేర్కొన్నాడు. అదేమంటే సస్పెండ్ చేస్తానని బెదిరిస్తున్నారని చెప్పారు.

తనకు షుగర్ ఉందని, మానసికంగా తాను, తన కుటుంబం ఒత్తిడికి లోనవుతున్నట్లు వాపోయాడు. రెండు ఇంక్రిమెంట్లు కూడా వేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని, న్యాయం చేయాలని ఆర్డీఓను వేడుకొన్నాడు. దీనిపై తహసీల్దార్ నగేష్‌ను ఆర్డీఓ రాజకుమారి విచారించారు. వ్యక్తిగతంగా తాను దూషించలేదని, కార్యాలయ తాళాలు ఉప తహసీల్దార్‌కు అందించడం, కార్యాలయం శుభ్రంగా ఉంచుకోవడం వాచ్‌మెన్ బాధ్యతని సమాధానం ఇచ్చారు.

మహిళపై దాడి చేసిన నలుగురిపై కేసు

నాదెండ్ల: స్థల వివాదంలో మహిళపై దాడికి పాల్పడిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆవుల భాస్కర్ తెలిపిన వివరాల మేరకు ఎండుగుంపాలెం గ్రామానికి చెందిన నూతక్కి రిబ్కాపై అదే గ్రామానికి చెందిన యర్రసాని బాలకోటి, అతని ఇరువురు కుమారులు, మనవడు తనపై దాడికి పాల్పడ్డారు. ఆమె తలకు గాయాలు కావటంతో నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఇరుకుపాలెం గ్రామం ఎస్సీ కాలనీని గురువారం ఆయన సందర్శించి, గ్రామంలో జరుగుతున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు. కాలనీలోని గృహాలను సందర్శించి, తొట్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు.

మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న వైసీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: కందిపాడు గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా గురువారం రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు చెన్నుపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. మొదటి రోజు సీనియర్, ఆరు పళ్ల సైజు ఎడ్లకు పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆరు జతలు ఎడ్లు బల ప్రదర్శనలో సత్తాచాటాయి.

శుక్రవారం నాలుగు పళ్ళ, జూనియర్, సేద్యం విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజవర్గ నాయకులు వడ్డే కృష్ణారెడ్డి, రవి చౌదరి, మండల పార్టీ నాయకులు చింతారెడ్డి సాయి రెడ్డి, గ్రామ సర్పంచ్ కంభంపాటి పాప, ప్రకాష్, ఎంపీటీసీ రేగులగడ్డ తిరుపతమ్మ, శ్రీనివాసరావు, మర్రి చంద్రారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

సత్తెనపల్లి: మహిళ అదృశ్యం పై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. భీమవరం గ్రామానికి చెందిన యంపోగు హనుమంతరావు భార్య యంపోగు రుతమ్మ, వయస్సు 53 సంవత్సరాలు. ఈ నెల 8న మధ్యాహ్నం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని భర్త ఫిర్యాదులో పెర్కొన్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా కనిపించలేదని తెలిపాడు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నందికుంట విఘ్నేశ్వరస్వామి కానుకల లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న అధికారులు

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం దేవదాయశాఖ అధికారులు హుండీ లెక్కింపు నిర్వహించారు. గడిచిన రెండు నెలల కాలంలో హుండీ ఆదాయం రూ.1,00,346 లు, విరాళాల రూపంలో రూ.35 వేలు సమకూరినట్లు దేవదాయశాఖ అధికారి తులసీదాస్ చెప్పారు. ఈ ఆలయాన్ని సుమారు ఏడు నెలల క్రిందట దేవదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులు కానుకల రూపంలో గానీ, హుండీ ఆదాయం గానీ సుమారు రూ.6.10 లక్షలు సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ పల్నాడు జిల్లా ఇన్‌స్పెక్టర్ కె.మంజూష, గ్రామ పెద్దలు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.